# ప్రాయశ్చిత్తం

'ఎంతచదువు చదువుకొన్నా, వుద్యోగం లేకపోతే, ఆ చదువుకి సార్థకతలేదని' చంద్రశేఖరం యిటీవల దృఢంగా యేర్పర్చుకున్న అభిప్రాయం. అతని అభిప్రాయమే అని అనడమెందుకు? తొంభైతొమ్మిదిపాళ్ళు నిజం కూడాను.

బి.ఏ, ప్యాసైన చంద్రశేఖరం, వుద్యోగంకోసం కాళ్ళరిగిపోయేలా తిరిగి, ఫలితంలేక విసిగిపోయి, చివరికి ఒక నిర్ణయానికివచ్చాడు. అదే-యేదన్నా వ్యాపారం ప్రారంభించాలని నిశ్చయించుకున్నాడు. ఇంట్లో వూరికేకూచుని బద్ధకాన్నీ, సోమరితనాన్నీ తనలో జీర్ణించుకునేకంటె, యీ నిర్ణయమే సరైనదనిపించింది. అతనిదృష్టిలో ఫ్యాన్సీస్టోర్సు మెదిలింది. అందుకు ఓ పథకం తయారుచేసేసరికి, ప్రస్తుతానికి కనీసం రెండువేలరూపాయల పెట్టుబడి అయినా ఉండాలనిపించింది. తన తండ్రి చనిపోయాక, ఓ యేడెనిమిది వేలవరకు ప్రావిడెంట్ ఫండ్ వచ్చింది. ఆపైన తల్లి బంగారంకూడా వుండేది ఇదంతా చిన్నాన్న దగ్గరే అట్టేపెట్టడం జరిగింది. తమకోసం అందులో కొంత వ్యయమైనా, కొంతయినా మిగిలివుంటుంది గాబట్టి యీ రెండువేలు సంపాదించడం యేమంత క్లిష్ట

సమస్యగా తోచలేదతనికి. తన నిర్ణయం తెలుసుకున్నాక చిన్నాన్నకూడా సంతోషిస్తాడని అభిప్రాయపడ్డాడు చంద్ర శేఖరం.

ఓ శుభసమయాన తననిర్ణయాన్ని చిన్నాన్నకు తెలియజేశాడు చంద్రశేఖరం.

రామచంద్రయ్య, జీవితంలో మంచి అనుభవం సంపాదించిన వ్యక్తి. అందుకు తోడుగా, రెవిన్యూ డిపార్టుమెంటులో పనిచేస్తున్న వాడాయె. డబ్బు విలువ అతనికి తెలిసినంతగా మరొకరికి తెలీదని, అతనితో పరిచయమున్నవాళ్ళు అంటుంటారు. డబ్బుకీ, అతనికీ వున్న అనుబంధం, యితనికి మరేవ్యక్తితోనూ లేదనే చెప్పుకోవాలి. డబ్బుముందు మరో అనుబంధం విశిష్టంగా కనిపించదన్నా, ఆశ్చర్యపోనవసరంలేదు. అన్నగారు పోయాక, వదిననూ, ఆమె కొడుకు చంద్రశేఖరాన్నీ తన యింట ఆశ్రయమిచ్చి, ఆదరించాడంటే, అందుకు కారణం వాళ్ళ దగ్గర డబ్బు వుండడమేనని కొందరు చెప్పుకుంటారు. అయితే, అతని ప్రవర్తన దృష్ట్యామాత్రం, అది వ్యక్తంకాదు.

చంద్రశేఖరం అన్న మాటలకు, రామచంద్రయ్య మొహంలో కాస్త కలవరపడిన మాట వాస్తవమే కాని, జీవితంలో సంపాదించిన అనుభవాన్ని పురస్కరించుకొని, తమాయించుకున్నాడు. అతని పెదాలపై మందహాసం విరజిమ్మింది.

"నీ నిర్ణయం బాగానే వుందిరా! కాని అంత డబ్బు యిప్పు డెక్కణ్నించి వస్తుంది?" అన్నాడు నెమ్మదిగానే.

"అమ్మ మీ దగ్గరుంచిన బంగారం, డబ్బూ వుండాలి కదా చిన్నాన్నా! అందులోవిదే సర్దుబాటు చెయ్యండి. పోనీ, యీ వ్యాపారంలోనైనా నా అదృష్టం కలిసివస్తుందేమో ప్రయత్నించి చూస్తాను..."

రామచంద్రయ్య అదోలా నవ్వి "పిచ్చివాడా! ఇంకా అవన్నీ నా దగ్గర మూలుగుతున్నాయనే అనుకుంటున్నావా? ఏనాడో అవన్నీ కరిగిపోయాయి. నీ చదువు యెట్లా సాగిందని అనుకుంటున్నావు!" అన్నాడు.

చంద్రశేఖరం కొయ్యబారిపోయాడు. చిన్నాన్న నోట అటువంటి జవాబు వినాల్సివస్తుందని అతడు యేనాడూ అనుకోలేదు.

"డబ్బు సంగతి అటుంచండి సుమారు నలభై యాభై తులాల బంగారం వుండా లనుకొంటాను అదంతా కరిగిపోయిందంటారా?" అనుకోకుండా అతని స్వరంలో కటువుదనం వినిపించింది.

"నేను అబద్ధం చెప్తున్నాననా నీ అభిప్రాయం! లేకపోతే, నీ మెదడు యేమైనా చెడిందా!" కోపంగానే అన్నాడు రామచంద్రయ్య.

చంద్రశేఖరం మనస్సు చివుక్కుమంది తమ డబ్బు అతని వద్ద యేమీ లేదని చిన్నాన్న చెప్పడం వల్ల కాదు ప్రస్తుతం అతను బాధపడింది, తన మెదడు చెడిందని ఆయన ఆరోపిస్తున్నందుకే కృంగిపోయాడు.

"మీరు చెప్తున్నవి వింటుంటే నిజంగా మెదడు చెడి పోయే స్థితి వుందేమో చిన్నాన్నా."

"ఒరేయ్ శేఖరం – నువ్వు చిన్నవాడివి. నీకు వున్న ప్రపంచజ్ఞానమనగా యెంత? నీ చదువుకి యెంత ఖర్చయ్యిందో నీకు తెలుసునా? తెలీదు ...అంతా మీ అమ్మకు తెలుసు ... నిజం చెప్పాలంటే, నీ చదువు పూర్తి అవడానికి యింక ఆరు నెలలుండనగా మీ డబ్బూ, బంగారం, అంతా అయి పోయింది. ఆ మనోవ్యథతోనే మీ అమ్మ కృశించి పోయిం దేమోననిపిస్తూ వుంటుంది నాకు. నేను సహాయం చెయ్య కుండా మానేస్తానా? అప్పట్లో నీ చదువు ఆపకుండా ఆదు కున్నాను. అటువంటిది – నువ్విప్పుడేమో, మీ డబ్బేదో నా దగ్గర మిగిలిపోయిందని అడుగుతున్నావు. పోనీ – నేను సర్దు బాటు చెయ్యడానికైనా, నా దగ్గరమాత్రం యెక్కడుంది? ఆ మధ్యనే అమ్మాయి పెళ్ళికి ఆరువేల వరకూ వ్యయమైన విషయం నీకు తెలీంది కాదు. ఇంక కొంత డబ్బు బట్టల కొట్టులో యివ్వాలి కూడాను."

చంద్రశేఖరంకి, చిన్నాన్న వుపన్యాసం తృప్తి కలిగించ లేకపోయింది. చిన్నాన్న తన డబ్బు కాజెయ్యడానికే ప్రయ త్నిస్తున్నాడన్న విషయం గ్రహించేశాడు. ఆయన యింత కపటంగా ప్రవర్తించదల్చుకుంటే అన్ని విధాలా మానసి కాందోళనతో క్రుంగుతున్న తనుయేఆధారమూ లేకుండాయిలా వుండాల్సిందేనా?...క్షణంసేపుతీవ్రంగాఆలోచించాడు. తనని, తనతల్లినీ, తనతండ్రి పోయాక చిన్నాన్న ఆదరించాడన్నకృత

జ్ఞతాభావం ఒక ప్రక్క, ఆ ఆదరణలో స్వార్థం, కుట్ర యిమిడివున్నాయన్న క్రోధం - మరో ప్రక్క, అతని అంతరాళంలో ఘోరంగా సంఘర్షణ పడ్డాయి. అవుతేనేం - కృతజ్ఞతాభావం ఓడిపోయింది.

తనకి వున్న ఆధారం మరేమీలేదు. ఆస్తిలేదు ఉద్యోగం లేదు. ఇక తను యింటింటా తిరిగి యాచన చేసుకోవాల్సిన దుర్గతి కూడా పట్టవచ్చు.... అతని కళ్ళు ఒక్కసారి గిర్రున తిరిగాయి. భవిష్యత్తు భయంకరంగా కనిపించింది దూరంలో. అతని వొళ్ళంతా భయంతో కంపించింది. చిన్నాన్న స్వార్థానికి తను యెందుకు బలికావాలి? ఆయన తన పిల్లల్ని వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడు. వారి బాగోగులు చూస్తున్నాడు. పెద్ద కొడుకును మెడిసిన్ చదివిస్తున్నాడు. చిన్నకొడుకు మొన్ననే యింజనీరింగులో చేరాడు. కూతుర్ని ఓ ఆఫీసరు రాంకులో వున్న వ్యక్తికిచ్చి పెళ్ళిచేశాడు. వాళ్ళంతా బాగానే వున్నారు ఎటొచ్చీ చెడిపోవల్సింది తనే. అలా ఎందుకు జరగాలి?...అని తనలో తనే ప్రశ్న వేసుకొని ప్రతిఘటించాడు.

“చిన్నాన్నా! మీరలా చెప్తుంటే యింక నేనేం చేసేది? కాని-ఒక్క విషయం- మీరు యెన్ని లెఖ్ఖలు వేసుకున్నా, మాడబ్బు పూర్తిగా తరిగిపోదు ...కొంత మిగలవల్సే వుంది...” అన్నాడు చంద్రశేఖరం

రామచంద్రయ్య అదోలా నవ్వేడు.



GUDIVADA TQ. KRISHNA DT.

"నిజంగానే నీ బుర్ర చెడిందిరా శేఖరం, ఔనుమరి.... నువ్వు అనుభవించిన వ్యథలు యెట్లాంటివి?....తండ్రి పోయాడు ....చేదోడు వాదోడుగా వుంటున్న తల్లిపోయింది. చదువు కున్నా, వుద్యోగం దొరకడం దుర్లభమయ్యింది. ఇవన్నీ నీ పట్లజరిగిన అన్యాయాలే ఇట్టిస్థితిలో నీబుర్ర చెడిందంటే, ఆశ్చర్య మేమీ లేదు" అన్నాడు.

చంద్రశేఖరం మొహం కోపంతో యెర్రబారింది.

"చిన్నాన్నా" అంటూ గట్టిగా అరిచాడు అప్రయత్నంగా, "అనవసరంగా మీ స్వార్థంకోసం, నాకు లేనిరోగం తెచ్చి పెట్టకండి. ఈ వెధవడబ్బుగురించి నన్ను పిచ్చివాణ్ణి చెయ్యకండి...." గట్టిగానే అన్నాడు.

చంద్రశేఖరం కేకలు లోపలున్న రామచంద్రయ్య భార్య భాగ్యలక్ష్మి విని చరచరా వచ్చింది.

"ఏమిటీ కేకలు?" విసుగ్గా అనుకుంటూ వచ్చింది.

రామచంద్రయ్య నవ్వుతూనే, నిశ్చలంగా జరిగిన విషయం చెప్తూ, "మనవాడికి పాపం మతి చెడిందే" అన్నాడు.

చంద్రశేఖరానికి సహనం పట్టుతప్పింది

"స్వార్థంకోసం మీరు యేం చేసినా ఆశ్చర్యపడనవసరంలేదు. మీకు డబ్బే సర్వస్వం. ఆత్మీయత, మానవత్వం మీరు యేనాడో వదులుకున్నారు. మరోఆసరాలేక, మీ పంచన వచ్చి చేరినందుకు మాకు తగినశాస్తిచేశారులెండి. చివరకు, నాకు పిచ్చెత్తిందని ఆరోపించడానికూడా వెనుకంజ వెయ్య

లేదు. అది మీ తప్పుకాదు... మీలో నిస్వార్థం అలాచేయి స్తోంది. పోనీలెండి-ఆ డబ్బుతో మీరే బాగుపడండి... మీ పిల్లల్ని యింకా అభివృద్ధిలోకి తీసుకురండి" అంటూ ఒళ్ళు తెలీని కోపంతో చెప్పుకుపోతున్న చంద్రశేఖరం వాగ్ధాటికి "శేఖరం" అన్న రామచంద్రయ్య కేక ఆనకట్ట కట్టింది.

అప్పుడే లోపల ప్రవేశించిన కరణం కనకరాజు ఆ దృశ్యంచూసి విస్తుపోయి

"ఏమిటిదంతా రామచంద్రయ్యా!" అన్నాడు.

కరణం కనకరాజుగారు ఆ సమయంలో రావడం, రామచంద్రయ్యకి వెయ్యి యేనుగులబలం వచ్చినట్టయింది.

"రండి రండి రాజుగారూ? మంచి సమయానికే వచ్చారు. చూడండి మావాడి దురవస్థ. తండ్రిపోయాడు- తల్లి పోయింది... పైగా వుద్యోగం లేదొకటీ! ఇవన్నీ వాడి మెద దుని పాడుచేశాయి. వాళ్ళనాన్న డబ్బు యింకా నాదగ్గర మూలుగుతోందనుకొని రెండువేలు తెమ్మంటున్నాడు. ఇది పిచ్చి కాకపోతే మరింకేమిటి చెప్పండి? మా అన్నయ్య డబ్బు విషయం మీకు మాత్రం తెలీందేముంది? ఎప్పటికప్పుడు, యీ విషయాలు మీ చెవినవేస్తున్నామాయె...." అంటూ ఓ వుపన్యాసం సమగ్రంగా దంచేశాడు. భాగ్యలక్ష్మి యింక అక్కడ వుండటం యిష్టంలేక చరచరా లోపలికి పోయింది.

"చిన్నాన్నా! మళ్ళీ ఆమాటే అంటున్నారు. అదేం భావ్యంగాలేదు. మీ రనుకుంటున్నట్టు నాకేమీ మెదడు చెడి పోలేదు." కోపంగానే అన్నాడు చంద్రశేఖరం.

కనకరాజుకి యీ విషయమంతా తెలుసు. అసలు, అవసరమైనప్పుడు యీ నాటకం ఆడమని రామచంద్రయ్యకి సలహా యిచ్చింది యీ పెద్దమనిషే. ఇటువంటి అనర్థకాలకు నాంది గీతంపాడి ప్రోత్సహించకపోతే, యింక "కరణం కనకరాజు" అని యెలా అనిపించుకుంటాడు! తెలిసిన విషయమేకనుక, అదోలా నిట్టూర్చి చంద్రశేఖరంకి దగ్గరగావచ్చి, అతని భుజం తడుతూ "తొందరపడకు శేఖరం. నీకేమైనా రావల్సిన డబ్బువుంటే, యిప్పించడానికి మేమందరం లేమూ?" అని అంటూ రామచంద్రయ్యవేపు తిరిగి "రామచంద్రయ్యా, మనవాణ్ణి పట్నం తీసుకుపోయి పెద్ద డాక్టరుకి చూపించడం మంచిది. ఎన్నాళ్ళిలా వూరుకుంటావు?" అన్నాడు.

కనకరాజుగారి మాటలభావం అర్థం చేసుకుంటూనే ఆశ్చర్యపోయాడు చంద్రశేఖరం. ఆ ఆశ్చర్యంతోపాటు అతనిలో కోపం పరాకాష్ఠ నందుకుంది. అగ్నిమీద ఆజ్యం పోసినట్టుగా కరణంగారి మాటలు పనిచేశాయి. ఆ క్షణంలో ఆ కనకరాజుపీక నులిమేయాలన్నంత ఆవేశంవచ్చింది. అవుతే ఆవేశం రాక్షసత్వానికి ప్రథమసోపానమని ఆలోచించి తమాయించుకున్నాడు.

"కనకరాజుగారూ! మీ సలహాకి ధన్యవాదాలు. మీరూ మా చిన్నాన్న కలిసి అంత శ్రమకి పూనుకోవడం. నాకు యిష్టంలేదు. నాపిచ్చి కుదుర్చుకొందుకు నేనే ప్రయత్నిస్తాను. కాని ఒక్కవిషయం మాత్రం మీరిద్దరూ గుర్తుంచుకోవాలి. అన్యాయం యెప్పుడూ జయం పొందదు. నేనింతతో

చెడిపోయింది కూడా యేమీ లేదు .. వస్తా...." అంటూ విసురుగా బైటికి నడిచాడు చంద్రశేఖరం.

రామచంద్రయ్య, కనకరాజు యింటికప్పు యెగిరిపోయినట్టుగా నవ్వుకున్నారు. తామొక ఘనకార్యం సాధించామనే వారి ఆనందం.

"మీ సలహా గొప్పగా పని చేసిందండీ కరణంగారూ" వుత్సాహంగా అన్నాడు రామచంద్రయ్య, కరణంగారూ సగర్వంగా మందహాసం చేస్తూ "ఇంతకీ, న్యాయంగా అతడికి వెళ్ళవల్సిన డబ్బు యే మాత్రం వుంటుందంటావ్?" అన్నాడు.

"ఎంతో లెద్దురూ రాజుగారూ! తర్వాత మీకా వివరాలన్నీ చెప్పకుండా వుంటానా యేమిటి? ఇప్పటితో అయ్యిందా! మీసలహాలూ, సహకారం, సర్వదా మాకు అవసర ముంటాయి...అన్నట్టు, యీ వేళ ఆ నాయుడుగారి దగ్గరికి వెళ్ధామనుకున్నాం కదూ....పదండి...." అంటూ త్రోవతీశాడు రామచంద్రయ్య. కరణంగారుకూడా అతనితో పోయాడు.

*　　*　　*

రోజులు రష్యన్ స్పుత్నిక్‌లా గిర్రున తిరిగేస్తున్నాయి. ఓ రెండు సంవత్సరాల కాలం యిట్టే గడిచిపోయింది. రెండు సంవత్సరాల కాలమంటే తమాషాకాదు. ఈ వ్యవధిలో యేమైనా జరుగవచ్చు. ప్రపంచం తల్లకిందులు కావచ్చు. యుద్ధఫలితంగా లోకమంతా భస్మీ పటలం కావచ్చు. కాల

మహిమ అంటే అటువంటిది...ఈ విధమైన కాలప్రవాహం లోనే రామచంద్రయ్య యింట్లో చాలా మార్పులు వచ్చాయి. రామచంద్రయ్య కూతురుభర్త ఓ ఆంగ్లో యిండి యన్ వనితను వివాహం చేసుకుని ఆమెకు విడాకు లివ్వడంతో, ఆమె పుట్టింటికి తిరిగివచ్చింది. ఈ సంఘటనకి చలించిపోయాడు రామచంద్రయ్య. మరికొద్ది రోజుల తర్వాత, రెండో అబ్బాయి చదువుకి స్వస్తిచెప్పి మిలటరీలో చేరాడు. దాంతో సగం మనిషయ్యాడు రామచంద్రయ్య. ఒక్క పెద్దకొడుకే ప్రయో జకు డయ్యాడన్న తృప్తి తప్పించి, మరో ఆనందం అతనికి మిగల లేదు.

రామచంద్రయ్య యింట్లో మార్పులు వచ్చిన విధం గానే, చంద్రశేఖరం జీవితంలో కూడా వూహించని మార్పులు వచ్చినయ్. చిన్నాన్న తనని పూర్తిగా మర్చిపోయినా, చంద్ర శేఖరం మాత్రం చిన్నాన్నని మర్చిపోలేదు. ఎలా మర్చి పోగలడు? అతని స్వార్థం, తనని పిచ్చివానిగా నిర్ధారణ చేసిన ఆయన తెలివితేటలు, —వీటిని మాత్రం మర్చిపోలేక పోయాడు, తన జీవితపథం అనుకోని విధంగా మారాక చిన్నా న్నకి వుత్తరం రాయాలనిపించిందతనికి

* * *

ఓనాడు రామచంద్రయ్య హాల్లో కుర్చీలో కూచుని కూతురు గురించి, రెండో కొడుకు గురించి ఆలోచనలు సాగి స్తున్నాడు. అతని మనసు బాగా ః కలమయింది తెనుచేసిన

అన్యాయాలకు భగవంతుడు యీ విధంగా తనకిశాస్తి జరుపు తున్నాడేమో నన్న వూహకూడా అప్రయత్నంగా కలిగిం దతనిలో. అప్పుడతనికి చంద్రశేఖరం గుర్తుకువచ్చాడు ఆనాడు చంద్రశేఖరంఅన్న మాటలుకూడా గుర్తుకొచ్చినయ్....మరింత కలవరపడ్డాడు.

సరిగ్గా అదే సమయంలో పోస్టుమాన్ రెండు వుత్త రాలు తెచ్చియిచ్చాడు. రెండూ కవరు వుత్తరాలే. ఓ కవరు మీద అడ్రసు పరిచితమైనదే. పెద్దకొడుకు రాసిందని వూహించాడు. రెండో వుత్తరం అతనిలో ఆసక్తిని పెంచింది. చప్పున కవరుచించి వుత్తరం తీశాడు. దిగువ సంతకం చూసి విస్తుపోయాడు 'చంద్రశేఖరం' రాసిన వుత్తరమది. అతని గుండెలు యెందుకోఅర్థం లేకుండా కొట్టుకున్నాయి ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

మ॥రా॥శ్రీ చిన్నాన్నగారికి,

నమస్కారాలు—

ఆనాడు మీరు నాడబ్బు కాజేసే నెపంతో నన్ను పిచ్చి వానికింద జమకట్టడం, మీరు నాకుచేసిన ఓ గొప్ప వుపకారమే అనుకోండి అక్కణ్ణించి నేరుగా మద్రాసు వచ్చేశాను. రెండు నెలలు యెన్నికష్టాలు అనుభవించానో ఆ భగవంతుడికే తెలుసు. అవుతేనేం- నేను ఆశ విడిచిపెట్టలేదు. నా అదృష్టం పండి, ఓ భాగ్యవంతుల అమ్మాయికి చదువుచెప్పే అవకాశం లభించింది. అదంతా ఓ కలలా జరిగింది. ఈ అనుబంధం మా యిరువురి ప్రేమానుబంధంగా మారింది. ఆ అమ్మాయికి తల్లి

లేదు. తండ్రికి ముద్దులకూతురు. బాగా డబ్బుంది. ఆ అమ్మాయితండ్రి నా కులగోత్రాలూ, మంచీచెడ్డా అంతా భోగట్టాచేశాడు. ఉన్నది ఉన్నట్లు చెప్పాను. ఆయన నా హృదయం కనిపెట్టి, నాపట్ల అభిమానం పెంపొందించుకుని, నన్ను తన అల్లునిగా చేసుకున్నాడు. ఇప్పుడు నేను, యెప్పుడూ వూహించని జీవితం సాగిస్తున్నాను. అదుంకు ముఖ్యంగా మిమ్మల్ని, కరణంగార్ని అభినందించాలి. మీకు కృతజ్ఞత తెలుపుకోవాలి. ఆనాడు మీరు నాకు నేనడిగినవిధంగా ఆ రెండువేలు యిస్తే, నేనింకా అక్కడే నానా అవస్థ పడుతూ బ్రతుకీడ్చేవాణ్ణేమో! కరణంగారి కూడా యీ వుత్తరం చూపించండి. నేను పిచ్చెక్కి యిలా వుత్తరం రాస్తున్నానని మీరు అనుకుంటే నా తప్పేమీ లేదు. సెలవ్.

మీ 'చంద్రశేఖరం'

రామచంద్రయ్య కళ్ళు మసకలు కమ్మినట్టయ్యాయ్. తను యేమిటి చదువుతున్నాడు? ఇది నిజమేనా? లేక, వాడిలా తనని అసూయపర్చడానికి కల్పించి రాశాడా?....అని అనుకున్నాడేగాని, చంద్రశేఖరం రాసిందంతా నిజమై వుంటుందని నమ్మకండా వుండలేక పొయ్యాడు. చంద్రశేఖరం అభివృద్ధిలోకి రావడం అతని ఆంతర్యానికి విరుద్ధం. అందుకే, అతనిలో అసూయ బీజాలు మొలకెత్తాయి. ఆ అసూయలో విసుగు, వుద్రేకం వుట్టిపడ్డాయి. చప్పున మరో ఆలోచనకు తావివ్వకుండా, రెండోకవరు చించి, వుత్తరంతీశాడు. ఉత్తరం చదవడం పూర్తి చేసేసరికి, అతనికి కళ్ళు తిరిగినట్టయ్యాయి. ఇంటి

కప్పు కూలి తలమీద పడినట్టయ్యింది మొహం వివర్ణ మయ్యింది. కళ్ళల్లో నీటి చారలు పొడజూపాయి.

"భాగ్యం...భాగ్యం...." అంటూ కేక వేశాడు.

భాగ్యలక్ష్మి, పరుగు నడకలతో లోపల్నుంచి వచ్చింది. "ఏమయ్యిందండీ? ఎందుకలా కేక వేస్తారు?" విసుగ్గా అంది

"కేకేవిటి? నిజంగా నాకు పిచ్చెత్తుతోంది."

"ఏమయ్యిందండీ?"

"ఇంకేంకావాలి? ఇప్పుడు జరిగినవాటికి అగ్నిమీద ఆజ్యంలా యిది తోడయ్యింది. పెద్దబ్బాయి క్రిష్టియను లేడీ డాక్టర్ని రిజిష్టరు పెళ్ళి చేసుకున్నాట్ట ఆ నెధవ శుభ వార్తంటూ యిప్పుడు తెలియజేస్తున్నాడు"

"ఏవిటండీ మీరు చెప్తోంది?" ఆత్రంగా అందామె.

"ఔను భాగ్యం—నేనేం పరిహాసం ఆడ్డంలేదు. కావా లంటే, యీ వుత్తరం చూడు" అంటూ చేతిలోవున్న వుత్తరం అందిస్తూ "వీడిమీద నేను యెన్నిఆశలు పెట్టు కున్నానో యెవరికేం తెలుసు?" అన్నాడు నిట్టూర్చి.

భాగ్యలక్ష్మి వుత్తరం చదివి వుస్సురని నిట్టూర్చింది.

"ఎంతపని చేశాడండీ!" అంది బాధగా.

"వాడికేం - వాడు హాయిగానే వుంటాడు. నేనెందుకు బ్రతికి వున్నానా అనిపిస్తుంది..."

"అవేం మాటలండీ! ఎందుకు మీరంతగా అధైర్య పడ్డం?"

"నా ఆవేదన నీకు తెలీదు భాగ్యం; పిల్లల్ని అభివృద్ధి లోకి తీసుకురావాలని నేనెన్ని అవస్థలు పడ్డానో, యెన్ని అన్యాయాలకు ఒలపడ్డానో, నీకు తెలీదా! కాని, చివరికి యేం ఫలితం దక్కిందని? ఒక్కరి వలనా మనకి ఆనందం లేక పోయింది...." అంటూ గట్టిగా శ్వాసవిడిచి ఆగాడు. నీకు జ్ఞాపకం వుందా భాగ్యం- చంద్రశేఖరంని పిచ్చివాడిగా జమ కట్టి యింటినుండి వాడు వెళ్ళిపోయేలా చేసి వాడిడబ్బు కాజేశాను! కాని, వాడికి అదో అనుకోని అదృష్టంగా మారింది. వాడిప్పుడు ఓ భాగ్యవంతుల ముద్దుల అల్లుడై వుంటున్నా డట..."అన్నాడు.

"మీ కెట్లా తెలిసిందండీ?"

"ఈ వుత్తరం చదువు...." చంద్రశేఖరం రాసిన వుత్త రాన్ని అందించాడు.

భాగ్యలక్ష్మి వుత్తరాన్ని సాంతంచదివింది. చదవడం ముగించి, అనూయతోగా మోను గట్టిగా నిట్టూర్చింది.

"ఎంత అదృష్ట వంతుడండీ" అప్రయత్నంగా అనే సింది. లోలోపల చూడలేనితనం దహిస్తున్నా.

"వాడి అదృష్టం విషయం మనకెందుకు ? మనం యెంత దురదృష్టవంతులమో, అది ఆలోచించు. ఇప్పుడు మనం యేం చూసుకొని ఆనందించాలి ? చంద్రశేఖరం అదృష్టానికి యేడ

వడమా? మనదురదృష్టానికి ఏడవడమా? ఇప్పుడు యెవరుపిచ్చి వాళ్ళు? చంద్రశేఖరంని ఆరోజు మతి భ్రమించిన వాడిగాజమ కట్టానుగాని, నిజంగా యిప్పుడు నాకే మతి చలిస్తుందేమో.... భగవాన్... ప్రాయశ్చిత్తం యీరూపంలో కనబరుస్తున్నావా?...." అంటూ రెండు చేతుల్తో తల పట్టుకొని కూర్చుండి పోయాడు రామచంద్రయ్య. అతని హృదయాంతరాళంలో యెటువంటి సంక్షోభం చెలరేగిందో, అతనికే తెలును.

భాగ్యలక్ష్మి, శిలాప్రతిమలా చలన రహితంగా నిల్చోవడం తప్పించి, యింకేమీ అనలేకపోయింది. పాపం! ఏం అనగలదు ఎవరు పిచ్చివాళ్ళో తనుమాత్రం యేం చెప్పగలదు?